# ప్రేమకి అటూ ఇటూ

## కాసల నాగభూషణం



వెన్నెల్లో గోదారి పడవ ప్రయాణంలాంటి అందమైన కాలేజీ జీవితం చేజారి అప్పటికప్పుడే మూడేళ్ళయి —

ఏదో మా గోపాలంగాడి ధర్మమా అంటూ వాడి పెళ్లి పేరుతోనయినా మిత్రులంతా మళ్ళీ ఓ చోట కలుసుకునే అవకాశం కలుగుతుంది గదా అని వాడి శుభలేఖ కోసం ఎదురుచూస్తున్న తరుణంలో వాడు రాసిన వుత్తరం నాకు పెద్ద ఆశాభంగాన్నే కలిగించింది.

వాడి పెళ్ళి వసుంధరతో జరగబోదన్నది ఆ వుత్తరం మోసుకొచ్చిన వర్తమానం. అంత నిక్కచ్చిగా వాడా మాటని ఎలా రాయగలిగేడో, అసలందుకు కారణమేమయి వుంటుందో అని ఆతృతగా కళ్ళింతలు చేసుకు చదివేను తక్కిన వుత్తరాన్ని. ఏదీ ఒక్క వాక్యం వుంటేనా దానికి సంబంధించి? అంతా వుద్యోగం లేక తను పడ్డ బాధలూ, తిరిగిన వూళ్ళూ, కలుసుకున్న వ్యక్తులూ, ఆఖరికి తను విశాఖలో ఆ వుద్యోగాన్ని సంపాయించుకున్న వైనమూ, అమ్మతో కలిసి తను అక్కడే కాపురమున్న సంగతీ — ఇవి రాసేడేగాని అందులో ఆ వసుంధర గురించి ఏ ఒక్క ముక్కా రాయలేదు గోపాలం. నేనై వీలు కల్పించుకుని వెళితే తన దగ్గరికి అప్పుడు చెబుతాట్ట తనే స్వయంగా నాతో ఆ వివరమేమిటో! పైగా తొందరగా రమ్మని అభ్యర్థన!

అసలా గోపాలంగాడి వరసే అంత. ఏదో ఇంత సస్పెన్సుని పుక్కిట్లో దాచుకుని, కథని పేజీలకి పేజీలే పెంచేసి, పాఠకుల చేత చెవి మెలిపెట్టి మరీ చదివింపజేసే కథకుడి మనస్తత్వం వాడిది! ప్రయత్నిస్తే వాడూ ఓ మంచి కథకుడే అయ్యేవాడని నా అనుమానం. పాఠకుల అదృష్టం బావుండి అంత ఓపికా, కోరికా వాడికి లేక పోయేయి. మిత్రులం మేమూ బాగుపడిపోయేం.

అయితే తనలోని ఆ టాలెంట్‌ని అలా కథల కోసం కాకుండా తన మామూలు సంభాషణల్లోనే

వినియోగిస్తాడు గోపాలం. "నడుస్తూ నడుస్తూ దార్లో తాడుని చూసి భయపడ్డాను పామనుకుని" అని చెప్పడానికి మారుగా

"నిన్న ఒంటరిగా వస్తున్నానా దార్లో! బాగా చీకటిపడింది. కంటికేదీ కనబడడం లేదు. సరిగా ఆ చింత చెట్టు దగ్గరికొచ్చేనా — కాలి కేదో తగిలింది మెత్తగా. జరజరా పాకినట్టూ అనిపించింది. బిత్తరపోయేను. అంతకు ముందెప్పుడో ఆ దార్లోనే పాము కరిచి చనిపోయిన పరంధామయ్య గుర్తొచ్చేడు. ఒళ్ళంతా చెమట పట్టేసింది. ఒక్క వుదుటున పరుగు లంకించుకుని ఇంట్లోకొచ్చి పడ్డాను. రాత్రంతా ఒకటే కలలు నిద్దట్లో — పాములు నన్ను చుట్టేసినట్టు, కాటేసినట్టు! తీరా ఉదయాన అటువెళుతూ చూస్తే ఏముంది? — దారం!" అని చెప్పి ముగిస్తాడు.

వాడలా చెప్పడంలో కాలం కొంత ఖర్చయి పోవడం తప్పించి మరే నష్టమూ మనకి లేకపోయినా ఆ బుద్ధిని ఇదిగో ఇలా వుత్తరాల్లోనూ ప్రదర్శిస్తే మాత్రం చాచి ఓ లెంపకాయిచ్చుకోవాలనిపిస్తుంది. లేదంటే వున్నపాటున సెలవు పెట్టి వుడాయించడానికి ఇదేం గవర్నమెంటుద్యోగం అనుకుంటున్నాడా?

ఉదయం కొట్టు తెరిచిందగ్గర్నుంచీ రాత్రి మళ్ళీ కట్టేసేటంతవరకూ కూమని కూమనీ నడుములు విరగ్గొట్టుకోవాలి.

"తోషిబా ఆనంద్ సెల్ వెల ఎంత?"

"మొత్తంగా కొంటే ఓ గ్రోస్ మీద ఎంత రేటు తగ్గిస్తారు వైట్ పేపర్లకి?"


"వారం మునుపే వస్తాయన్నారు సిరిలాక్ డబ్బాలు. ఇంకా రాలేదేం?" — వగైరా ప్రశ్నలకి మొహంలో విసుగు కనబడనివ్వకుండా సమాధానాలు చెప్పాలి.

"వెళ్ళాలి త్వరగా! ప్యాక్ చేసి ఇవ్వండి" స్టాక్ రూంలోకి వెళ్ళిన పనికుర్రాడు తిరిగొచ్చేలోపునే వినవచ్చే ఈ పురమాయింపుని చిరునవ్వుతో ఎదుర్కోవాలి.

"ఇదిగోండి! మీరే ఇచ్చేరు మారని నోటు' అనే కంప్లెయింట్‌కి నా దగ్గరే అది చిరిగిపోయిందన్నట్టుగా సంజాయిషీ ఇచ్చుకోవాలి.

మొత్తం మీద ఈ ఏడాదిలో క్షణం నిలవని కాలాన్ని కొలవడానికి అనుక్షణమూ విరామం లేకుండా నడిచే గడియారంలా పని చేస్తూ ఈ ఫ్యాన్సీ వస్తువుల అమ్మకంలో నేనే ఓ పెద్ద ఫ్యాన్సీ వస్తువుగా మారిపోయేను. ఇక ఇంటి పనులు సరేసరి!

ఉద్యోగం కోసం చూసి చూసి విసిగిపోయి




సొంతంగా ఈ షాపుని బస్తీలో తెరవడంతో బాటుగా అమ్మానాన్నల మాట మీద మరదలు కవీశ్రీమతితో ఈ మధ్యే కొనుక్కున్న చిన్న ఇంటిలో పెట్టుకున్న కొత్త కాపురం! పైగా ఆ ఇంటిని కూడా మా అభిరుచుల మేరకి మార్చుకోవడంలో అయిన ఖర్చు మాట అటుంచి, దగ్గరుండి ఆ ఇంటి పనులు చేయించుకోవడంలో నా తల ప్రాణం తోక్కొచ్చినంత పనయింది. ఆ ప్రాణం ఇంకా తిరిగొచ్చి తల్లోకి చేరుకోనేలేదు, ఇంతలో విశాఖకి రమ్మని వుత్తరం రాసాడు గోపాలం. ఏం, తనే రారాదూ ఓ లీవ్‌లెటర్ రాసి పడేసి — ఫూలిష్ ఫెలో!

అనకూడదుగాని —

మేం కాలేజీ వదిలి వచ్చిం తర్వాత మా మంచీ చెడూ ఒకరికొకరం వుత్తరాల్లో తెలుపుకోవడం తప్ప వెనకటికిలాగా మనసులు విప్పి మాట్లాడుకునేటంత సావకాశంగా కలుసుకోవడం పడలేదు. మా విరహంతో బాధపడే ఆ రామకృష్ణా బీచ్ రోడ్డునీ, సముద్రపు ఒడ్డున అలల తాకిడులతో పులకిస్తూ నిలుచున్న నీలి బండల్నీ, డాల్ఫిన్స్ నోస్ పర్వతాలనీ వెళ్ళి ఆప్యాయంగా పరామర్శించే అవకాశమూ కలగలేదు. మరిప్పుడు నేను వీలు చేసుకుని వెళితే ఈ ఆశా నెరవేరుతుంది. వాడికి వుద్యోగం రావడం తరువాయి వసుంధరతో జరిగిపోతుందనుకున్న పెళ్ళికి ఇప్పుడెదురైన ఆటంకమేమిటో అది కూడా తెలుస్తుంది. అయితే ఈ యాంత్రిక జీవితంలో ఆ మాత్రం వెసులుబాటెప్పుడు దొరుకుతుందా, వాడి ముందెప్పుడు వాలుతానా అని తహతహలాడుతున్నంతలో—

సెలవు కోరుకుంటున్న ప్రభుత్వోద్యోగికి సరిగా అదే రోజున పబ్లిక్ హాలిడే కలిసొచ్చి నట్టు — వున్నట్టుండి వూడిపడ్డాడు మా తమ్ముడు సూట్‌కేస్‌తో సహా! వాణ్ణి చూడగానే కలిగిన సంతోషాన్ని లోలోపలే దాచుకుంటూ అడిగేన్నేను బెట్టుసరిగా "ఏరా వచ్చేసేవ్ - సెలవులా కాలేజీకి?" అని.

వాడు జైలు నుంచి ముందుగానే విడుదలై వచ్చిన ఖైదీలా అదో రకమైన రిలీఫ్ ఫీలవుతూ అన్నాడు "వారం రోజులుగా స్ట్రయిక్ యూనివర్సిటీలో! హాస్టళ్ళన్నీ ఖాళీ చేయించేసేరు స్టూడెంట్ లీటర్లు."

అంతే! విన్నానుగాని వాడి మాటల్ని, "ఏం, ఎందుకని?" అని ప్రశ్నించలేదు వాణ్ణి. ఎంచేతనంటే అత్తల మీద అలిగి పుట్టింటికెళ్ళిపోయే కోడళ్ళ అలకలకయినా సబబయిన కారణాలుంటాయేమోగాని ఈ కాలేజీ కుర్రాళ్ళ స్ట్రయికులకి ఆపాటి కారణాలయినా వుంటాయని నేననుకోను. అందుకనే వాణ్ణి సాదరంగా ఆహ్వానించేను. వాడు భోజనం వగైరా పూర్తిచేసి, ప్రయాణం బడలిక కాస్త తీర్చుకోగానే వాణ్ణి పిలిచి స్టోర్‌లో కూచోబెట్టి, ఇవ్వవలసిన సూచనలన్నీ ఇచ్చి బయలుదేరేను ఓ జత బట్టలు సర్దుకుని. ప్రయాణం చేస్తున్నంతసేపూ నాకు తెలిసినంతలో గోపాలం వసుంధరల పూర్వాపరాల్ని జ్ఞప్తికి తెచ్చుకోసాగేను. అయినా ఎంత ఆలోచించినా వసుంధరని వాడిప్పుడు ఎందుకు వద్దనుకుంటున్నాడో ఆ విషయం వూహించలేకపోయేను. అసలు వాళ్ళిద్దరి పెళ్ళి ప్రతిపాదనలో పునాది ప్రేమ — మరే ప్రలోభాలూ కావు — అని అప్పట్లో మా అంచనా!

అప్పట్లో — అంటే మేం చదువుకునే రోజుల్లో — నేనూ, మరో ఇద్దరు మిత్రులూ కలిసివుండేవాళ్ళం ఓ అద్దె గదిలో. గోపాలం వాళ్ళ వూరు గుంటూరే అయినా అక్కడ విశాఖలోనే పోస్టల్ డిపార్ట్‌మెంట్లో పనిచేసే వాళ్ళ బాబాయి గారింట్లోనే వుండి చదువుకునేవాడు. మా రూంమేట్స్ ఇద్దరితో కంటె నాతోనే ఎక్కువ స్నేహం గోపాలానికి. ఆ రోజుల్లో మేమూ, మరికొందరు మిత్రులమూ కలిసి ప్రతి రోజూ అటు సాయంత్రం కావడం ఆలస్యం వూళ్ళోకి కలిసికట్టుగా బయలుదేరేవాళ్ళం. అలా అలా వీధులు తిరిగి, అక్కడక్కడా సెంటర్లలో నిలిచి చివరికి సముద్రం ఒడ్డుకి చేరుకునేవాళ్ళం. ఆ సమయాల్లో ఆ మేట వేసిన తెల్లనైన ఇసుక

తిన్నెల్లో, నల్లని బండరాళ్ళలో, అలల సంగీతాన్ని మోసుకొచ్చే చల్లగాలుల్లో కాలమంతా తియ్యనైన మా ప్రేమ కబుర్లతోనే కరిగిపోయేది. మెల్ల మెల్లగా దిక్కుల్ని పట్టుకుని జారుతున్న చిమ్మ చీకటి క్రమంగా అలల నురుగుల తెల్లదనంలో కలిసిపోయి ఆకాశమంతా వెన్నెల వెల్లవేసి పోయేది.

అలా కలల మైకం కమ్ముకున్న ఆ సాయం వేళల్లో మాలో ప్రతి ఒకడూ తను ప్రేయసిగా ఆరాధించే అమ్మాయి తాలూకు అందమైన కబుర్లని అదేపనిగా ఏకరువు పెడుతూ వుంటే వింటూ నా మట్టుకి నేను అంతటి అదృష్టానికి నోచుకోలేకపోయేనే అని నాలోనే బాధపడేవాణ్ణి. అందుకు కారణం మా అత్తయ్య కూతురు! పొరపాటున ఎప్పుడయినా నేనూ ఏ షాపింగ్ సెంటర్లోనో, సినిమా థియేటర్లోనో, బీచిలోనో ఆఖరికి మా కాలేజీలోనో సన్నగా, పొడవుగా వున్న ఎవతెనయినా 'అరే! ఈ పిల్ల ఎవరో — బావుందే!' అనుకుంటూ అటు చూడబోయేనా — ఇంతలో ఆ అమ్మాయిలో మా పొట్టి జడల ప్రమీలే సాక్షాత్కరించేది. ఇక ఆ తన్మయత్వంలో మునిగి తిన్నగా రూముకి చేరుకున్న నాకు ఆ వూపులో రాసుకున్న విరహగీతమే మిగిలేది. ఈ ఆనుపానులు తెలిసినవాళ్ళు గనుక మిత్రులు ప్రేమ విషయంలోని అప్పటి నా నిస్సహాయతని అలుసుగా తీసుకుని నన్ను మరింత వుడికించేలా తమ ప్రేమ కబుర్లని చిలవలుపలవలు కల్పించి మరీ రసవత్తరంగా చెప్పుకుపోయేవాళ్ళు. నన్ను ఏకైక శ్రోతని చేసుకుని నలుగురూ నాలుగు వేపులా విజృంభించి ప్రణయకథాగానం చేసే వాళ్ళు. అయితేనేం? అందుకు ప్రతీకారంగా నేను నా కాలేజీ చదువటు పూర్తికాగానే ప్రేమించిన మరదలినే పెళ్ళాడేసి, ఎంచక్కా ఓ ఇంటి వాడినయ్యేను — వాళ్ళందరికంటె ముందు! అది వేరు విషయం. మరి మా గోపాలం మాట కొస్తే—

సరిగా అలాంటి సందర్భాల్లోనే ఓ శుభ ముహూర్తాన వసుంధర ప్రస్తావన తీసుకొచ్చేడు వాడు. ఇక అప్పట్నుంచీ ఆవిణ్ణే స్మరిస్తూ, ఆవిడ నామం జపిస్తూ తన ప్రబంధకవుల నాయికా వర్ణనల పరిజ్ఞానాన్ని సార్థకం చేసుకున్నాడు — పరీక్షల్లో ఏం రాసేడోగాని!

ఇంతకీ అలా మా కబుర్లలో దొర్లిన ఆ వసుంధర ఆ వూళ్ళో బాగా పేరు పొందిన లాయర్ విశ్వనాథంగారి గారాల కూతురు. మా

## జీవన కాంక్ష

తనంతట తాను వస్తే తప్ప
మృత్యువును నేనెప్పుడూ పిలవను
దాని నెప్పుడూ కొలవను
చావును అధిగమించడానికి
చావుకైనా వెనుకాడను
కష్టాల సానరాయి మీదే
జీవితం పదును తేలేది
మృత్యు వాసన కంటే
పురిటి గబ్బే యిష్టపడతాన్నేను
జీవం అంటేనే కదలిక
కదలిక అంటే ఘర్షణ; పోరాటం
పోరాటమే ఏకైక జీవన సత్యం
పోరాటం వన్నగిల్లిన చోటే
మృత్యువు తచ్చాడుతుంది

జీవితమెప్పుడూ
అలవటెరుగని అల
విశ్రమించని ఘోష
చినుకు కోసం మొరలెత్తే నేల
మొలకవ్వడానికి నేలను చీల్చే విత్తు
కొమ్మను తొలుచుకొచ్చే చిగురు
ఆమని కోసం ఎదురుచూసే కోయిల
రూపాయి నన్ను రైలు క్రిందికి తోసిందనో
ప్రేమ నా తలను రోటిలోకి నెట్టిందనో
పెనం మీంచి పొయ్యిలోకి జారాననో
నన్ను నేను కోల్పోయాననో
మృత్యువును నేనెప్పుడూ పిలవను
నా జీవన కాంక్షను వీడను
నా జీవన కాంక్ష జీవం కంటే గొప్పది

— జుగాష్‌విలి

కాలేజీలోనే చదివేది. మాకో సంవత్సరం జూనియర్.

గోపాలానికి ఆవిడ పరిచయం లభించడం 'ఊర్వశి' థియేటర్లో ఓ ఇంగ్లీష్ పిక్చర్‌కి అది వచ్చిన రోజే లేడీస్ క్యూలో తనకీ ఓ టిక్కెట్ సంపాయించిపెట్టడంతో!

మనసులు తెలుపుకోవడం కళ్ళతో!

ప్రేమని కొనసాగించడం లాయర్‌గారి పక్కింటి మేడ మీది గదిలో వున్న మా క్లాస్‌మేట్స్‌ని కలవాలనే సాకుతో వీడు,

మా క్లాస్‌లో వున్న తన స్నేహితురాలి కోసం అన్నట్టుగా వస్తూ ఆవిడ!

తొలి కబుర్లు వుత్తరాల మూలంగా!

తెలుగు నవలల్లో దాక్కుని, బస్టాపుల్లో చేతులు మారే ఆ వుత్తరాలు సరాసరి ఆ నవలల్లోని ప్రేమలేఖలతోనే పోటీ పడేవి!

ఆ విషయం తెలుసుకునే అవకాశాన్ని వాడే నాకు కలిగించేడు. ఓసారి తనకి వసుంధర రాసిన వుత్తరాన్ని తమ ప్రేమ తాలూకు ప్రోగ్రెస్ రిపోర్ట్‌లా నా చేతికిచ్చి చదవమన్నాడు. నేనా వుత్తరాన్ని ఆశ్చర్యపోతూ చదివేను. చదువుతూ ఆశ్చర్యపోయేను. అప్పుడే వాడి వాలకమూ కాస్త గమనించేను.

ప్యాంటూ, షర్టూ మ్యాచింగ్ చూసి మరీ కొనుక్కుని కుట్టించుకున్న నాలుగైదు జతల బట్టలూ, దువ్వెనని జేబులోనే వుంచుకుని పదే పదే శ్రద్ధగా తల దువ్వుకోవడమూ, రోజూ షేవింగూ, అందంగా తన పేరుతో అచ్చేయించుకున్న గులాబిరంగు లెటర్ ప్యాడూ, రంగురంగుల స్కెచ్ పెన్సిళ్ళూ, కొత్త బూటూ, సంతోష తరంగంలా మాటిమాటికీ పురికే చిరునవ్వూ — ఈ అంతటికీ, గత కొద్ది కాలంగా మాటలో, మనిషి తీరులో వస్తున్న మార్పులకీ వెనక ఆ వసుంధర ప్రమేయం ఎంత వుందో గ్రహించేను.

ఆ తర్వాత ఒకటి రెండు సార్లు వసుంధరనీ కాస్త పరీక్షగానే చూసేను. నేనూ తనతో మాట్లాడేను. అయినా ఆ మాత్రం పరిచయంతో ఆవిణ్ణి — ఆవిడ మనస్తత్వాన్ని — తెలుసుకోవడం సాధ్యం కాకపోయినా ఎందుకో ఆ వసుంధర పట్ల మా గోపాలం ఆకర్షింపబడడం అంత సహజం కాదేమో అనిపించింది నాకు. ఎందుకంటే గోపాలం మానసిక ప్రమాణాలు వసుంధర కంటే భిన్నమైనవనే నా అభిప్రాయం. అంటే ఆమెకీ, అతనికీ మధ్యనున్న అంతస్తుల తేడా వాళ్ళ ప్రేమకి అడ్డుగోడగా నిలుస్తుందని కాదు — అంతకు మించి ఏదో బలమైన సెంటిమెంటు అతన్ని ఈ వుత్తుత్తి ప్రేమల నుంచి విముఖుణ్ణి చేస్తుందనే అనుమానం! గాలి నిట్టూర్పుల్ని వింటూ అది మోసితెచ్చిన పూల పరిమళాన్ని ఆనందించలేమన్న ఆందోళన! అయితే నాలోని ఈ అనుమానానికీ, ఆందోళనకీ అప్పట్లో స్పష్ట

మైన రూపం వుందో, లేదో చెప్పలేనుగాని మన స్ఫూర్తిగా మాత్రం కోరుకున్నాను వాళ్ళిద్దరూ ఏకం కావాలని!

మరి ఎందుకిలా జరిగిందిప్పుడు?

గోపాలం స్థానంలో మరొకణ్ణి ఎంచుకుందా వసుంధర?

లాయర్ విశ్వనాథంగారి తాహతుకి తూగలేకపోయేడా గోపాలం?

కట్న కానుకల దగ్గర పేచీలా?

లేక తనకుద్యోగం వచ్చింతర్వాత గోపాలం వసుంధరని మించిన మంచి సంబంధం ఆశిస్తున్నాడా?

ఎందుకో వాడికి స్నేహితుణ్ణిగా చివరి రెండు అనుమానాలనీ నేనే హర్షించలేక పోయేను.

ఏమయితేనేం? ఇలా తర్జన భర్జన పడుతూనే విశాఖ చేరుకున్నాను. మూడేళ్ళలో సిటీలో వచ్చిన మార్పుల్ని చూస్తూ వాడు రాసిన అడ్రస్ పట్టుకుని వెదుక్కుంటూ వాళ్ళింటికి వెళ్ళేను. వెళితే—

"ఎవరు నాయనా!" అంటూ వరండాలోనే ఎదురై పలకరించింది వాళ్ళ అమ్మ. ఆ సమయంలో ఆమెని చూడగానే నాకనిపించింది ఒక్కటే—పసుపు కుంకుమలే వుంటే ఈమె ఇంకెంత కళగా వుండేదో! అని.

ఆమె నన్ను తన పుత్ర రత్నం తాలూకు స్నేహితుణ్ణిగా గుర్తించింది.

"నువ్వా బాబూ, రా! అంటూనే వున్నాడు మావాడు నువ్వొస్తావని!" అంటూ నా చేతిలోని బ్రీఫ్ కేస్‌ని అందుకుంది.

"రా!" అని మళ్ళీ పిలుస్తూ ఇంట్లోకి దారి తీసింది.

నేను ఆమె వెనకే నడిచి అటు ముందు గదిలోకి వెళ్ళగానే అక్కడున్న ఫ్యాన్ ఆన్ చేసింది. బ్రీఫ్ కేస్‌ని టేబుల్ పక్కన స్టూల్ మీద వుంచింది.

"ఇప్పుడే ఎవరో స్నేహితులొస్తే వెళ్ళేడు. వచ్చేస్తాడులే!" అంటూ లోపలికెళ్ళి గ్లాసుతో మంచినీళ్ళు పట్టుకొచ్చి ఇస్తూ ఆప్యాయంగా అడిగింది "ఏం బాబూ! ఫ్యాన్సీ షాప్ పెట్టుకున్నావటగా! బాగా జరుగుతోందా? మరదలితో కాపురం ఎలా వుంది? అన్నీ చెబుతూ వుంటాడులే మావాడు!"

నేను "షాప్ పరవాలేదమ్మా!" అని జవాబు చెప్పి, నీళ్ళు తాగి ఫ్యాన్ కిందికి జరిగి నుంచున్నాను గాలికోసం.

ఆమె గ్లాసందుకుంటూ నావేపు చూసి "అయ్యో! చెమటతో తడిసిపోయేవు బాబూ! స్నానం చేసెయ్, ఈ లోగా వాడొచ్చేస్తాడు" అంటూ నా మాటకోసం ఆగి చూడక లోపలికి



సినటి-నాటి, తిరుపతి.

స్నానాల గదివేపు కాబోలు నడిచింది.

నేను ప్రయాణం జిడ్డు వదిలేలా స్నానం చెయ్యాలని వున్నా, కొత్త చోటవటం మూలాన వెళదామా, వద్దా అని తటపటాయిస్తుంటే

"నీళ్ళు తోడేను, రా బాబూ!" అని మా అమ్మ పిలిచినట్లే పిలిచింది.

ఇక ఆ పిలుపుతో నా సంకోచం ఎగిరిపోయింది. నేను వెనక స్నానాల గదిలోకి వెళ్ళేను. అప్పటికే అక్కడ బక్కెట్లో గోరువెచ్చని నీళ్ళు, మగ్గు, సోపు అన్నీ సిద్ధంగా వున్నాయి.

నేను బట్టలు విడిచి తువ్వాలు చుట్టుకున్నాను. మగ్గుతో నీళ్ళు ముంచి ఒంటి మీద పోసుకుంటున్నాను. ఇంతలో ఆమె అక్కడికొచ్చి

"బాబూ! వీపు రుద్దనా?" అని అడుగుతూనే నా వీపున నీళ్ళు కొన్ని చిలకరించి, సోపుతో కాసేపు రుద్దింది. మళ్ళీ నీళ్ళు ముంచి పోసి, సోపు మరగని శుభ్రంగా కడిగి వెళ్ళింది.

నేను స్నానం ముగించి పొడి బట్టలు మార్చుకుని అలా చల్లగాలి కొచ్చే సరికే వచ్చేడు గోపాలం "అమ్మా!" అంటూ. నన్ను చూడడంతోటే అమాంతం పరుగెత్తుకొచ్చి కావిలించుకున్నంత పనిచేశాడు.

వాడి గొంతు విని గోపాలం అమ్మ వంటింట్లో నుంచి వచ్చింది. పక్క పక్కనే వున్న మమ్మల్ని ద్దరినీ అలా మార్చి మార్చి చూసి తెగ మురిసిపోయింది. మళ్ళీ వంట గదిలోకి వెళ్ళింది.

మరి మేమో, చిర విరహం తరువాత కలుసుకున్నాంగా-ఏవేవో విషయాలు కలగాపులగంగా చెడ మాట్లాడుకుంటున్నాం. అయినా అలా మాట్లాడుతున్నంతసేపూ మనసులో ఒకటే తహతహ వాణ్ని వసుంధరని గురించి అడగాలని! అయితే ఆవిడ సమక్షంలో అడిగితే! ఆమె వినకూడని కారణమేమయినా వుంటే! ఇంతకీ ఈ వసుంధర సంగతి అమ్మతో చెప్పేడా గోపాలం?

ఇలా నా అనుమానాల్లో నేను వేగిపోతూ వుంటే స్నానం చేసి రావడంతోటే మా ఇద్దరికీ అన్నం వడ్డించింది. గోరుముద్దలు చేసి నోటి కందించడం ఒక్కటే తక్కువ—అంత గోముగా దగ్గరుండి తినిపించింది.

మేం భోజనం ముగించి వక్కపొడి నములుతూ వాడి గదిలోకి వెళ్ళేం. ఇదే అదనని నేను వసుంధర విషయం అడగడానికి నోరు మెదప బోతే వాడు "ఇప్పుడు కా"దన్నట్టు సైగ చేస్తూ టేప్ ఆన్ చేసేడు. మేం ఒకటి, రెండు పాటలు వినేంతలో ఆమె డాబా మీద మంచాలు వాల్చి పక్కలు పరిచి "నాయనా! వెళ్ళి పడుకోండి" అంటూ మమ్మల్ని లేవదీసింది.

గోపాలం టేప్ ఆపి ట్రాన్సిస్టర్ అందుకున్నాడు. మేమిద్దరం మేడమీదికెళ్ళాం.

పైన పగటి తాపాన్ని తీర్చే చల్లగాలి. లేత వెన్నెల్లో మిలమిల లాడుతూ టపటప కొట్టుకుంటున్న కొబ్బరి మట్టల చప్పుడు. ఎంతో ఆహ్లాద కరమైన వాతావరణం. కాని మనసులో ఒకటే కలకలం.

వాడు డాబా పిట్టగోడకి ఆనుకుని నుంచుని ఎటో చూస్తున్నాడు.

నేనిక వుండబట్టలేక అడిగేను "ఇంతకీ ఏమిటి సంగతి—నేనొస్తేగాని చెప్పనన్నావ్?"

ఇలా అడగడంతో వాడిలోని వసుంధర జ్ఞాపకం తళుక్కున మెరిసింది కాబోలు—ఆ మొహం ఒక్క వెలుగు వెలిగి అంతలోనే మెరుపు మాసిన ఆకాశంలా వెలవెల బోయింది. వాడు తిన్నగా చెప్పడం మొదలెట్టేడు "నేనేమో చెబుతానుగాని తీరా నా మాటల్ని విన్న తర్వాత "ఇంత చిన్న విషయానికా?" అని నువ్వు విస్తుపోతే మాత్రం నిజంగా బాధపడతాను. కాని నువ్వు నన్ను తప్పక అర్థం చేసుకుంటావనే నమ్మకంతోనే నీకు చెబుతున్నాను. అయితే ఆవిణ్ని గురించి చెప్పే ముందు నీకు మా అమ్మను గురించి చెప్పాలి. ఎందుకంటే అమ్మ గతమేమిటో తెలియకపోతే నీకు నా మనసేమిటో అర్థం కాదు!"

గోపాలం క్షణం ఆగి, నా మొహంలోకి చూసి మళ్ళీ చూపులు మరల్చుకుని ఎటో చూస్తూ చెప్పసాగేడు. "మా అమ్మ బాగా కలిగిన కుటుంబంలోనే పుట్టింది. మా తాతయ్య వూళ్ళో హోదా, పది మందిలో పలుకుబడీ వున్నవాడు. అయితేనేం? పొలం తగువుల్లో మాట పట్టింపు కోసం కోర్టుకెక్కి వున్న ఆస్తిపాస్తులన్నీ తగ

లేసేడు. పైపెచ్చు వుంపుడుకత్తెని మరిగేడు. మిగిలిన ఒక్క ఇంటినీ ఆవిడ పేరన రాసి పెట్టేడు. ఇవన్నీ చూస్తూ ఓర్చుకోలేని మా అమ్మమ్మ మంచి మాటలతో ఆయనకి నచ్చ జెప్పాలని ప్రయత్నించింది. ఏడ్చింది. అయినా ఫలితం లేకపోగా ఆవిడ దయాదాక్షిణ్యాలతోనే బ్రతకాల్సిన పరిస్థితి ఎదురయింది అమ్మమ్మకి. ఆ అవమానం భరించలేక ఆమె ఆత్మహత్య చేసుకుంది. అంటే మా అమ్మ చిన్నప్పుడే అమ్మని పోగొట్టుకుంది. తాతయ్యకి భయపడి తల్లి లేని బిడ్డగా ఆవిడ అదుపాజ్ఞల్లోనే పెరిగింది. తనకి వూహ తెలిసేక ఇక ఆవిడ దగ్గర హీనంగా పడివుండలేక మా బంధువుల్లో మరొకరి ఇంటిని ఆశ్రయించింది. వాళ్ళే మా అమ్మకి పెళ్ళిచేసిపెట్టారు. అమ్మ కాపురానికి వెళ్ళింది. పుట్టింట్లో కరువైన సౌఖ్యాన్ని మెట్టినింట్లో వయినా పొందుతున్నానని సంతోషిస్తున్నంతలో కాలానికి కన్నుకుట్టి నేను కడుపులో వుండగానే కాటేసింది నాన్నగారిని. ఫలితంగా అమ్మ మళ్ళీ కష్టాలతోనే కాపురం చేయవలసి వచ్చింది. తీపిగురుతుగా మిగిలిపోవలసిన బాల్యాన్నీ, పసుపు కుంకుమలతో కళకళ లాడవలసిన ఐదోతనాన్నీ ఆమెకెటూ దక్కించలేను. కనీసం ఈ శేష జీవితంలోనయినా అమ్మని ఏ కొంచెమయినా సుఖపెట్ట గలిగితే అదే నా అదృష్టంగా భావిస్తాను. అది నా బాధ్యత కూడా!'' గోపాలం చెప్పుకు పోతున్నాడు. నేను స్థాణువునై వింటున్నాను.

''బాబూ!'' అని వినిపించే ఆ చల్లని పిలుపు వెనక, వాత్సల్యంతో వెల్లివిరిసే ఆ తెల్లని నవ్వు వెనక, ఆస్తి, చదువు, హోదా, నాగరికత—వీటి నీడలు కూడా సోకని గ్రామీణమైన ఆ ఆత్మీయత వెనక, ఒడ్డులు తాకి ప్రవహించే ఆ అనురాగ తరంగిణి వెనక గుండెని పిండే ఇంతటి విషాద గాథ వుందని తెలిసి కన్నీళ్ళ పర్యంతమవుతున్నాను! అయినా నా ప్రశ్నకి సమాధానంగా గోపాలం ఆమెని గురించి ఎందుకు చెబుతున్నాడో నాకర్థం కాలేదు.

ఇంతలో వాడే అన్నాడు ''అయితే ఆ ఆశయమే దెబ్బతినే ప్రమాదం ఎదురయింది వసుంధర వల్ల!''

నేనులిక్కిపడ్డాను.

''అంటే?'' అడిగేను అర్థంకాక.

గోపాలం చెప్పడం కొనసాగించేడు. ''మనకో సంవత్సరం జూనియర్ కదూ వసుంధర! మనం డిగ్రీ పూర్తిచేసి అంతటితో కాలేజీ వదిలేసేం. కాని ఆవిడేమో ఇక్కడే యూనివర్సిటీలో అలాగే రెగ్యులర్‌గా పి.జి. కూడా చేసింది.

ఓ యంపీగారు ఢిల్లీ నుంచి హైదరాబాదు వస్తూ తన సతీమణికి ఓ మంచి మిక్సీ కొనుక్కొచ్చాడు. దాని మీద ''దీనితోమీ వంటింటి పని సగం తప్పిపోయినట్టే'' అని పెద్ద పెద్ద అక్షరాలతో రాసి వుంది.

''ఏం పిసినారులండీ మీరు? ఆ తెచ్చేదేదో రెండు తేకపోయారా?'' అని విసుక్కుంది భార్య చికాగ్గా.

—పద్మశ్రీ (మాణిక్యారం)

నేను గుంటూరెళ్ళి అక్కడ వుద్యోగ యత్నాలు మొదలెట్టాను. అయినా అది వస్తుందన్న నమ్మకం లేక, వున్న ఆర్థికమైన ఇబ్బందుల్లోనే ఎలాగో కష్టపడి ప్రయివేట్‌గా ఎం.కాం. చేసేను. ఈమధ్య కాలంలో వసుంధరకి వుత్తరాలు రాస్తూనే వున్నాను.

తనూ బదులిస్తూ వుండేది. కాని ఎందుకో ఆ వుత్తరాల్లో వెనకటి ప్రేమా, ఆప్యాయతా కనిపించేవి కావు. పైగా ఏదో 'ఈగో' గోచరించేది. అది తెలిసి ఆవిడతో నేరుగా మాట్లాడాలన్న కోరికని కూడా చంపుకుని మళ్ళీ ఆమెని కలుసుకునే యత్నం చెయ్యలేదు నేను. కాని ఇటీవల హఠాత్తుగా ఓ సంఘటన జరిగింది.

మా అమ్మా, నేనూ మా బంధువులబ్బాయి పెళ్ళికి బెజవాడ వెళ్ళేం. అక్కడ ఆ పెళ్ళిలో దర్శనమిచ్చింది వసుంధర—ఐశ్వర్యాన్ని ప్రదర్శించడానికే అన్నట్టు చేసుకున్న అలంకరణలో. నన్ను చూడగానే తనే వచ్చి పలకరించింది. పెళ్ళికూతురు తనకి దగ్గరి బంధువట. ఆ విషయం తెలిసి అప్పటి వరకు అంత ముభావంగా వున్నవాణ్ణి—ఆశ్చర్యపోవడమే కాదు, ఏ కాస్తో సంతోషించేను కూడా!

ఆ మాటా ఈ మాటా అయ్యేక వసుంధర ''ఉద్యోగం వచ్చిందటగా! మాట్లాడతారా మా డాడీతో?'' అని అడిగింది.

''నువ్వు చెప్పలేదూ?'' అని అడిగితే

''చివరి వరకీ నిలుస్తారన్న గ్యారంటీ ఏదీ?'' అంది.

నేనా మాటనీ జోక్‌గానే తీసుకున్నాను.

వసుంధరని మా అమ్మదగ్గరికి తీసికెళ్ళి ఆమెకి పరిచయం చేసేను. మరి ఇప్పటికీ మరిచిపోలేను —ఆవిడ ముఖాన్ని—మా అమ్మని చూడగానే ఆ వసుంధర కనబరిచిన ఏవగింపుని! అమ్మతో మాట్లాడిన ఆ ఒకటి రెండు మాటల్లోనూ తృణీకారం! చూపుల్లో తనకి అత్తగారుగా వుండడానికి పనికిరాదన్న నిర్లక్ష్యం!''

వాడి గొంతు బొంగురుపోయింది.

ఒకప్పుడు వసుంధర ప్రేమతో అమరత్వం సాధించానని సంబరపడిపోయిన గోపాలం! ఆవిడ పట్ల ఇప్పటి తన విముఖతకి గల కారణాలను చెబుతూ తనని తానే సమర్థించుకునే ప్రయత్నం చేస్తున్నాడు. అయినా తన మనసులో పొంగుకొస్తున్న దుఃఖాన్ని మాత్రం ఆపుకోలేక పోయేడు.

వాడి కనుకొలకుల్లోంచి జారిన రెండు కన్నీటి చుక్కలు ఆ మసక వెన్నెల్లోనూ ముత్యాల్లా మెరవడం నేను గమనించేను. తిన్నగా వాడి భుజం మీద చెయ్యి వేసేను.

''మరి ఆవిడతో అప్పుడు నువ్వేమయినా అన్నావా?'' అడిగేను

వాడు లేదన్నట్టు తలూపేడు.

''ఇంటికొచ్చి వుత్తరమేమయినా...'' అని అడుగుతూ వుండగానే

రాయలేదన్నట్టు తలూపాడు మళ్ళీ.

నాకు తెలుసు—ఇతరులవల్ల తను బాధపడడం తప్ప తను ఇతరుల్ని బాధపెట్టేలా ప్రవర్తించలేదు గోపాలం! పల్లెత్తుమాట అనలేదు! వాడికి కానున్న జీవిత భాగస్వామినిగా వసుంధర తెలుసుకోవలసిన మొట్టమొదటి విషయం ఇది!

మరి ఇలాంటి వాణ్ణి ఎలా ఓదార్చాలా అని అనుకుంటున్నంతలో

''బాగా రాత్రయింది. మీరింకా పడుకోలా?'' అంటూ డాబా మీదికొచ్చింది గోపాలం అమ్మ. స్టీలు చెంబుతో నీళ్ళు పట్టుకొచ్చి ఓ మంచం పక్కన వుంచింది.

''రాత్రి ఒక వేళ బాగా మంచు కురుస్తుంది బాబూ! దుప్పటి కప్పుకోండి! మరీ ఎక్కువయితే కిందికొచ్చే సెయ్యండి!'' అంటూ మెల్లగా కిందికి వెళ్ళింది ఆమె—అమ్మ!

నేను వాణ్ణి అలాగే భుజాలు పట్టుకుని తిన్నగా మంచం దగ్గరికి నడిపించేను.

వాడు మంచం మీద కూచుని బేలగా నావేపు చూసేడు. నేను లాలనగా వాడి భుజం తట్టి పడుకొమ్మని సైగ చేసేను. వాడు పడుకున్నాడు.

నేను మరో మంచం మీద నడుం వాల్చేను.

జీవితాన్ని ఏ దశలోనయినా, ఏ దిశగా నయినా మలుచుకునే అవకాశం మన చేతుల్లోనే వుందని—

మన అతిశయాలకీ, అనుమానాలకీ ప్రేమని బలితీసుకోవడం భావ్యం కాదని అటు వసుంధరకీ,

ఇటు మా వాడికీ నచ్చజెప్పగలనన్న ధైర్యంతోనే అప్పటికి మౌనం వహించేను.

ఎంచేతనంటే ఐశ్వర్యంవల్ల అబ్బిన ఆవిడ అహాన్ని భూతద్దంలోంచి చూసి బెంబేలు పడిపోయిన గోపాలానికి నా హితోపదేశం తలకెక్కాలంటే—

అప్పుడే బరువు దించుకుని అలుపు తీర్చుకుంటున్న గుండెకి కొత్త సత్తువ కొంత చేకూరాలంటే—

ఆ రాత్రి ఒడిలో ఆమాత్రం విశ్రాంతి అవసరమే మరి! ●